# వ్యవస్థీకృత కార్మికసంఘాల, రాజకీయ పార్టీల దివాళాకోరుతనాన్ని బట్టబయలు చేసిన మున్నార్ టీతోట మహిళా కార్మికుల విజయవంత సమ్మె

**మనదేశంలో** టీ తోటలు ప్రధానంగా అస్సాం, పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాలలో వున్నాయి. 35 లక్షల మంది కార్మికులు ఈ తోటలలో పనిచేస్తుండగా, వారిలో అధికులు మహిళలే. ఈస్టిండియా కంపెనీ ప్రారంభానికి ముందునుండి మనదేశంలో టీ తోటలకు రెండున్నర శతాబ్దాల పెద్దచరిత్ర వుంది. వలస ప్రభుత్వం అస్సాం లోనూ, ఇతర సరిహద్దు ప్రాంతాలలోనూ పడావుగా వున్న భూములను కలిపేసుకుని, తేయాకు మొక్కల పెంపకానికి యూరోపియన్ ఎంటర్‌ప్రైజెస్‌కి ఉచితంగా దీర్ఘకాలిక లీజుకి ఇచ్చింది. 'ఆర్కేట్' 'సర్దార్స్' అనే పద్ధతుల ద్వారా ఈ టీతోటలలో పనిచేయటానికి ఇతర ప్రాంతాల కార్మికులను రప్పించింది. తూర్పు, మధ్య భారతానికి చెందిన గిరిజన ప్రాంతాలనుండి ముఖ్యంగా ముండాలు, ఒరయన్లు, గోండులు, టాంటీలు, కోలులు, కొమరలు అస్సాం, పశ్చిమబెంగాలులలోని టీతోటలలో కార్మికులుగా మారారు. అదేవిధంగా తమిళనాడులోని గిరిజనులు కేరళలోని టీతోటలలో కార్మికులుగా మారారు.

అదే సమయంలో టీ తోటలను అభివృద్ధి చేయటానికి వలస ప్రభుత్వం 1859 యాక్టు 13 ద్వారా కార్మికులను కనీసం మూడేళ్ళపాటు టీతోటలకు కట్టిపడవేసే విధంగా చట్టాన్ని చేసింది. తోటల యజమానులు కార్మికులను నిలిపి వుంచుకోవటానికి వారికి ప్రభుత్వం అంగీకరించిన రాయితీలు కొన్నిటిని ఇచ్చేవారు. వసతి, మంచినీటి సరఫరా, వైద్య సదుపాయం, వంటచెరకు, బియ్యం, బట్టలు, ఒక్కోసారి కూరగాయలు పండించుకోవటానికి చిన్నపాటిస్థలం మొదలగునవి. ఆ విధంగా టీ తోటల కార్మికులకు రొక్కంద్వారాను, వస్తుసేవల రూపంలోనూ జీతాల చెల్లింపు విధానం ప్రవేశపెట్టబడి ఈ రెండున్నర శతాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది.

1947లో అధికారం బదలాయించబడిన తర్వాత కూడా, ఈ 68 సంవత్సరాలలోనూ టీ తోటల కార్మికులకు అదేవిధమైన జీతాల చెల్లింపు విధానం కొనసాగుతోంది. తమ పనిపరిస్థితులను, జీవన పరిస్థితులను మెరుగుపరుచుకోవటానికి టీ తోటల కార్మికులు చేసిన వివిధ పోరాటాల ఫలితంగా భారత ప్రభుత్వం ప్లాంటేషన్ లేబర్‌యాక్టు (పిఎల్ఏ) 1951ను చేసింది. అనంతరం దానికి అనేక సవరణలు కూడా చేశారు. వలస ప్రభుత్వం చేసిన చట్టాల ఆధారంగానే ఈ చట్టం చేశారు. ఈ పిఎల్ఏ చట్టం కిందకు టీ, కాఫీ, రబ్బరు, సింకోనా, యాలకుల తోటలు వస్తాయి. విద్యా, వైద్య సదుపాయాలు, క్యాంటీన్లు, క్రెచ్‌లు, వినోద సదుపాయాలు, సముచిత వసతి కల్పించాలని పిఎల్ఏ చట్టం టీతోటల యజమానులను నిర్దేశిస్తున్నప్పటికీ, టీ తోటల కార్మికుల జీవితాలలో ఏమాత్రం చెప్పుకోదగ్గ అభివృద్ధి రాలేదు. పిఎల్ఏ కార్మికులకు ఏమాత్రం ఉపయోగపడలేదు. టీతోటల యజమానులు ఉద్దేశ్య పూర్వంగానే పిఎల్ఏను అతిక్రమించటం, పిఎల్ఏను అమలుచేయటంలో వారి ఉదాశీనత, టీతోటల కార్మికుల వాస్తవ దుస్థితి నుండి వచ్చే ఆకాంక్షలు, కోరికల కనుగుణంగా పనిచేయటంలో కార్మికసంఘాల సాంప్రదాయవైఖరి, వీటి అప్రజాస్వామిక పనివిధానం, వేతన ఒప్పందాలన్నీ కార్మికుల వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా కార్మికసంఘాల నిరంకుశ నాయకత్వంలో ఏకపక్షంగా జరగటం–ఇవన్నీ టీతోటల కార్మికుల దుస్థితికి ముఖ్య కారణాలు.

పశ్చిమబెంగాల్, కేరళలో వామపక్ష ప్రభుత్వాలు సుదీర్ఘకాలం పరిపాలన సాగించినప్పటికీ, విప్లవ నినాదాలను అదేపనిగా వల్లెవేసినప్పటికీ, టీ తోటల కార్మికుల జీవన పరిస్థితుల్లోగానీ, పనిపరిస్థితుల్లోగానీ ఏవిధమైన మౌలికమార్పు రాలేదు సరికదా, ఇతర రాష్ట్రాలలో ఎలావుందో అలాగే వుంది.

నూతన సరళీకరణ ఆర్థికవిధానాలు మనదేశంలో ప్రవేశించిన తర్వాత, టీ తోటల యజమానులు ఏం పాట మొదలుపెట్టారంటే, ప్రపంచ మార్కెట్‌లో తాము పోటీపడలేకపోతున్నామని, అలా పోటీపడనివ్వకుండా ఉత్పాదక ఖర్చులు పెరిగిపోతున్నాయని! అందుకని కార్మికులకు ఇవ్వాల్సిన సదుపాయాలైన విద్య, వైద్యం, ఆహారం, వసతి, వేతనంతో కూడిన సెలవు, పండుగ సెలవలు మొదలుగు వాటిని తాము భరించలేమని! ఇంకా వాళ్ళేమి డిమాండు చేస్తున్నారంటే, ఈ సదుపాయాలన్నింటినీ సామాజిక బాధ్యతగా చూడాలని, 2007 మంత్రివర్గ కమిటీ సిఫారసుల ప్రకారం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఈ సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని అంటున్నారు. ఈ మంత్రివర్గ కమిటీ సిఫారసు ప్రకారం రాష్ట్రప్రభుత్వం, కేంద్రప్రభుత్వం, టీతోటల యజమానులు 10:40:50 నిష్పత్తిలో వీటిని భరించాలి. ఈ సిఫారసు ఆర్థికశాఖకు చెందిన 102 మంది సభ్యుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ యొక్క ఆమోదాన్ని కూడా పొందింది. ఈ విధమైన వాదనలతో టీతోటల యజమాన్యాలు, కార్మికుల సాధారణ డిమాండ్లైన 1951 ప్లాంటేషన్ లేబర్‌యాక్టు ప్రకారం కనీసవేతనాలను పెంచటం, చట్టబద్ధంగా వారికి కలుగజేయాల్సిన సౌకర్యాలలో మెరుగుదల మొదలగు వాటిని నిరాకరిస్తున్నారు. వర్గసంకర రాజకీయ విధానాలను, ఆచరణను కలిగి ఉన్న ట్రేడ్ యూనియన్ల నాయకత్వం ఈ అసంబద్ధపు వాదనలు తిప్పికొట్టే పరిస్థితిలో లేదు.

ఈ కారణంచేతనే టీతోటల కార్మికులు కనీసపాటి వేతనాలను కూడా పొందలేకపోతున్నారు. ఆయా రాష్ట్రాలలోని ఇతర నైపుణ్యంలేని కార్మికులు, వ్యవసాయ కార్మికులతో సమమైన వేతనాలను కూడా పొందలేక పోతున్నారు.

2015, జులై 29న అస్సాం రాష్ట్రప్రభుత్వం ఒక నమూనా ప్రకటనను జారీచేసింది. దాని ప్రకారం టీతోటలలో పనిచేసే సాధారణ రోజుకూలీ కార్మికునికి కనీసవేతనం రు.177.19గా వుండాలి. ఇది 2014 సెప్టెంబరు నుండి అమలవుతున్న ఇతర నైపుణ్యంలేని కార్మికుల వేతనంతో సమానం. దీని ప్రకారం రు.140.50 మాత్రమే టీ తోటల కార్మికులు రొక్కంగా పొందుతారు. రు.33.69 ఇతర సేవలు, సదుపాయాల రూపంలో (అందులో రు. 11.59 చట్టబద్ధంగా పొందాల్సినవి, రు.22.10 చట్టబద్ధం కానివి) వుంటాయి.

పశ్చిమబెంగాల్‌లో టీతోటల కార్మికులు చేసిన అనేక ఆందోళనల తర్వాత, త్రైపాక్షిక చర్చల అనంతరం 2015 ఫిబ్రవరిలో ఒక వేతన ఒప్పందానికి వచ్చారు. దీనిప్రకారం కార్మికులకు రొక్కం రూపంలో లభించే జీతం రోజుకు రు. 122.40. ఇది ఆ రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులకు చట్టబద్ధంగా చెల్లిస్తున్న కనీస వేతనం కంటే ఎంతో తక్కువ.

ఆవిధంగా టీ ఉత్పత్తిలో పెద్దవైన రెండు రాష్ట్రాల లోని కార్మికసంఘాలు కార్మికులకు న్యాయమైన, కనీసమైన వేతనాలను సాధించటంలో విఫలమయ్యాయి.

ఈ నేపధ్యంలో ఇప్పుడు కేరళ రాష్ట్రంలోని టీ తోటల కార్మికుల దుస్థితిని పరిశీలించాలి.

కేరళ రాష్ట్రంలో వివిధ తోటల్లో పనిచేసే 3 $^{1}/_{2}$ లక్షలమంది కార్మికుల వేతనాలను నిర్ణయించటానికి, వారి పని పరిస్థితులను, ఇతర డిమాండ్లను నిర్ణయించ టానికి 'ప్లాంటేషన్ లేబర్ కమిటీ' ఉన్నది. ఈ కమిటీలో రాష్ట్రప్రభుత్వ ప్రతినిధులు, తోటల యజమానులు, కార్మికులు (కార్మికసంఘాలు) వుంటారు. ఈ కమిటీలో సిఐటియు, ఏఐటియుసి, ఐఎన్‌టియుసిలు కార్మికుల ప్రతినిధులుగా వున్నాయి. సిపిఐ(ఎం)–దాని వామపక్ష మిత్రులు, కాంగ్రెసుపార్టీ–దాని మిత్రులు కేరళ రాష్ట్రంలో రెండు ప్రధాన కూటములుగా నున్నాయి. దాదాపు ఒకదాని తర్వాత ఒకటిగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నాయి.

టీతోట కార్మికుల వేతనాలను 2011 మే 22న చివరిసారిగా సవరించారు. వాస్తవానికి 2014 డిసెంబరు 31కి మరల సవరణలు జరగాలి. కానీ ప్లాంటేషన్ లేబర్ కమిటీ 9 నెలలు గడిచిపోయినాగానీ, వేతనాలు సవరించటానికి అవసరమైన ఏ చర్యలూ చేపట్టలేదు. వేతనాల సవరణ కొరకు మూడు కార్మిక సంఘాలు చేసింది శూన్యం. కార్మికుల ఆదాయాలకు, జీవనప్రమాణాలకు పొంతనలేకపోవటంవలన కార్మికులు చెప్పరాని బాధలను, కష్టాలను అనుభవిస్తున్నారు.

తోటల విభాగంలోని కార్మికులు, ప్రత్యేకించి టీ తోటల కార్మికులు కార్మికసంఘాల పనితీరుపట్ల తీవ్ర అసంతృప్తితో వున్నారు. ముఖ్యంగా మహిళా కార్మికులు తీవ్రబాధితులుగా వున్నారు. ఈ మహిళా కార్మికులు తమ వాస్తవ జీవన పరిస్థితులలో, పనిపరిస్థితులలో ఊరట కలిగించే చర్యలేమీ తీసుకొనని రాజకీయ పార్టీలపై, కార్మిక సంఘాలపై విసిగిపోయి వున్నారు.

కణ్ణన్ దేవన్‌హిల్స్ ప్లాంటేషన్ కంపెనీ (కెడిహెచ్‌పి) కేరళలోని మున్నార్‌లో టాటా గ్రూపు సంస్థగా వుంది. ఈ గ్రూపు టెట్లీ టీ యజమానిగా మొత్తం 24వేల హెక్టార్లలో 17 ప్లాంటేషన్స్ కలిగి వుంది. 2005లో టాటా సంస్థ తోటల వ్యాపారం నుండి తప్పుకోవటానికి నిశ్చయించుకుని, భాగస్వామ్య నిర్వహణపేరిట కెడిహెచ్‌పి లోని 75 శాతం షేర్లను, అందులోని 13,350 మంది కార్మికులకు ఒక్కొక్కరికి 300 షేర్లచొప్పున అమ్మింది. 'భాగస్వామ్య నిర్వహణ' (కార్మికులతో) అనే నినాదంతో యాజమాన్యం ఎంతో తెలివిగా కార్మికులను కంపెనీకి వెట్టికూలీలుగా కట్టిపడేసింది. యాజమాన్యపు విధానాలకుగానీ, నిర్ణయాలకుగానీ అడ్డుచెప్పని విధంగా, ఈ అందమైన పథకరచనద్వారా కెడిహెచ్‌పి ప్రపంచంలో 'ఉద్యోగస్తులే యజమానులైన' అతిపెద్ద టీ కంపెనీగా అవతరించింది. టీ ఉత్పాదనకు నమూనాగా మున్నార్ పట్టణం టూరిస్టు ప్రదేశంగా మారి టూరిస్టుల రాక పెరిగింది. ఉద్యోగులే యజమానులైన, మోడల్ టీ ఫ్యాక్టరీగా విలసిల్లుతున్న ఈ ప్రభలో ఆవగింజంత వాటాగానీ, వాటి లాభాలుగానీ వాటా దారులైన టీతోటల మహిళా కార్మికులకు ఏమాత్రం దక్కటంలేదు. ఈ మహిళల్లో చాలామంది మధ్య వయస్కులు, తమిళ నేపథ్యానికి చెందినవారు. తరాల తరబడి తీవ్రదోపిడీకి గురవుతూ, వారి శ్రమతో టాటా యాజమాన్యానికి లాభాల సిరులు కురిపిస్తున్నవారు.

మహిళా కార్మికులు ప్రధానంగా టీ ఆకు తెంపే పనిచేస్తారు. ఉదయం 6 గం॥లకే పనికి హాజరై మధ్యాహ్నం 12 వరకు ఏకబిగిన పనిచేస్తారు. ఒక గంట విశ్రాంతి తర్వాత మధ్యాహ్నం ఒంటిగంటకు మొదలుపెట్టి సాయంత్రం 6 గం॥వరకు పనిచేస్తారు. చాలామంది ఉదయం ఖాళీ కడుపుతోనే వస్తారు. ఎందుకంటే ఇంట్లో పనులు చూసుకున్నాక వారికి టీ తాగే టైము కూడా వుండదు.

ఆ ఏటవాలు కొండచరియల్లో సుమారు 70 కిలోల టీఆకును వారు తమ భుజాలమీద మోస్తారు. తీవ్రమైన తలనొప్పులతో (పనివల్ల కలిగినవి)వారు బాధపడతారు. ఈ కారణంచేతనే వారు తప్పనిసరిగా పనికి గైర్హాజరవుతారు. టీ తోటలలో విచ్చలవిడిగా పురుగుమందులు చిమ్మబడి, వాటి తాలూకు దుష్ప్రభావాలకు కూడా మహిళా కార్మికులు గురవుతారు. చాలాసేపు నిలబడివుండటం, అధిక బరువు మోయాల్సి రావటం మహిళా కార్మికులకు అదనపు సమస్యగా మారింది. చాలామందికి డాక్టర్లు గర్భసంచి తొలగించు కోమని సలహా ఇచ్చారు. అలాచేస్తే పనిచేసే సామర్థ్యం తగ్గిపోతుందేమోననే భయంతో వారు ఆ నొప్పిని భరిస్తున్నారు. చాలామంది

మహిళా కార్మికులు కీళ్ళ నొప్పులతో బాధపడుతున్నారు. సెలవు పొందే సదుపాయం ఉన్నప్పటికీ, ఒక్కరోజు సెలవు పెట్టినా జీతం కత్తిరిస్తారు. ఎవరికైనా క్రిమికీటకాల వంటివి కుట్టినా, ప్రాథమిక చికిత్స అనంతరం మళ్ళీ పని చేయాల్సిందే.

నిబంధనల ప్రకారం ఒక్కొక్కరు కనీసంగా రోజుకు 21 కిలోల ఆకును తెంపాలి. కానీ రోజుకు షుమారుగా 200 కిలోలు తెంచేట్లుగా కార్మికులు బలవంతంగా మలచబడ్డారు. అదనంగా తెంచిన వాటికి కిలోకి కేవలం 60పై॥ చెల్లిస్తారు. కానీ దానికే సూపర్‌వైజర్లకు 5 రూ॥ చెల్లిస్తారు. ఎందుకంటే సూపర్వైజర్లు బలవంతంగా పనిచేయిస్తారు కనుక.

నగదు రూపంలో చెల్లింపులు ఈ విధంగా వుండగా, సేవల రూపంలో చెల్లింపులు దీనికన్నా అధ్వాన్నంగా వున్నాయి.

ప్లాంటేషన్ లేబర్‌యాక్టు ప్రకారం పనిప్రదేశానికి సమీపంలో కార్మికులకు వసతి సౌకర్యాన్ని యాజమాన్యం కల్పించాలి. కానీ మున్నార్ టీఎస్టేట్స్‌లో (దేశంలోని ఇతర ఎస్టేట్స్‌లో మాదిరే) యాజమాన్యం కార్మికులకు ఒకే వరుసలో ఉన్న ఒక్క గది ఇళ్ళను కేటాయించింది. అవి కట్టిన నాటినుండి మరమ్మతులకు నోచుకోక శిధిలావస్థకు చేరాయి. వీటిని కార్మికులు 'లేయన్లు' అని పిలుస్తారు. ఉన్నతాధికారులెవరైనా పర్యటించినప్పుడు ఈ లేయన్లకు కంపెనీ కొద్దిపాటి అలంకరణ చేస్తుంది. కానీ ఈ ఖర్చుకూడా కార్మికుల జీతాల్లోంచే కోత పెడతారు. ఈ ఒక్కగది కుటీరాలకు బాత్రూం సదుపాయంగానీ, ఇతర సదుపాయాలుగానీ లేవు.

మరో సేవారూపపు వేతన చెల్లింపు ఏమంటే కార్మికుల పిల్లలకు విద్యాబోధన, వారి కుటుంబాలకు వైద్యసహాయం.

కెడిహెచ్‌పి యాజమాన్యం చట్టబద్ధంగా తప్పనిసరిగా కల్పించాల్సిన ఈ సదుపాయాలను ఏమాత్రం లక్ష్యపెట్టకుండా బేఖాతరు చేస్తున్నది. అత్యంత నామమాత్రంగా మాత్రమే వాటిని కల్పిస్తూ వాటినో పరిహాసంగా మార్చింది. ఎస్టేట్స్‌లో వున్న యాజమాన్యపు స్కూళ్ళలో కార్మికుల పిల్లలకు ఉచిత విద్యాబోధన జరగాలి. కానీ ఇక్కడ నాల్గవ తరగతి వరకు మాత్రమే ఉచితవిద్య. తర్వాత ఫీజులు చెల్లించాల్సిందే. ఫీజులు చెల్లించలేక కార్మికులు తమ పిల్లలను ఎంతో దూరాన ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారు.

కంపెనీ హాస్పిటళ్ళలో అందించబడే వైద్య సదుపాయం అతికొద్ది మాత్రమే. ప్రతి బాధకు కార్మికులకు తెల్లటి మాత్రలు ఇస్తారు. అవి వారి అనారోగ్యాన్ని ఏమాత్రం నయం చేయలేవు.

కార్మికుల కొరకు కంపెనీ పెట్టిన ఖర్చు – వారితో ఏమాత్రం సంప్రదించకుండానే, వారి అంగీకారం లేకుండానే వారి జీతాల నుండి మినహాయించ బడుతుంది. ఆ విధంగా ప్లాంటేషన్ కార్మికులకు చెల్లిస్తున్న వేతనం, కేరళలోని రోజువారీ కూలీకి లభించే వేతనంలో సగం మాత్రమే. ఈ ఆగస్టులో అస్సాంలోని టీ పరిశ్రమలపై పరిశోధన చేసిన జస్టిస్ రౌలెట్ కార్మికుల పనిపరిస్థితులు, జీవన పరిస్థితులు చాలా అధ్వాన్నంగా వున్నాయని, వేతనాలు చాలా తక్కువగా వున్నాయని, వారి కుటుంబాలు పోషకాహార లోపంతో తీవ్రమైన జబ్బులతో మరణాలకు చేరువవుతున్నాయని, కేరళలో పరిస్థితి కూడా దీనికి ఏమాత్రం భిన్నంగా లేదని తేల్చాడు.

ఈ బాధలకు తోడు మరోసామాజిక రుగ్మత వారిని పట్టిపీడిస్తోంది. పురుష కార్మికులు తాగుడికి బానిసలై, వారి కష్టార్జితాన్నంతా దానికే ధారపోస్తూ, కుటుంబ అవసరాలను, బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తున్నారు.

ఎంత పనిచేసినా ఒక మహిళా కార్మికురాలి వేతనం నెలకు రు. 5000/- మించదు.

కెడిహెచ్‌పిలో కార్మికుల భాగస్వామ్య నిర్వహణ, మహిళా కార్మికులను టీ ఎస్టేట్ల కట్టు బానిసలుగా కుదించివేసింది.

టీ పరిశ్రమలో టీ ఆకు తెంపేవాళ్ళే కీలకం. వారిపైనే దాని అభివృద్ధి ఆధారపడి వుంది. ఈ పరిశ్రమలో పురుషులు టీ ఆకు తెంపే పనికాక, దానిని వ్యాపార సరుకుగా మార్చే క్రమంలో విభిన్నమైన ఉద్యోగాలలో పనిచేస్తున్నారు.

ప్రతిసంవత్సరం యాజమాన్యం ప్లాంటేషన్ కార్మికులకు బోనసులను ప్రకటించి, చెల్లించాలి. గతసంవత్సరం కంపెనీ కార్మికులకు 19శాతం బోనస్ చెల్లించింది. కార్మికులు ఈ సంవత్సరం కూడా అదేవిధంగా వుంటుందని ఆశిస్తూవచ్చారు.

కానీ యాజమాన్యానికి మంచి లాభాలు వచ్చినప్పటికీ, ట్రేడ్ యూనియన్లతో సమావేశమై 10శాతం బోనస్‌ను మాత్రమే ప్రకటించింది. ఈ విధంగా బోనస్‌లో కోతపెట్టినా ట్రేడ్‌యూనియన్లు కిమ్మనలేదు. ఇప్పటికే భరించరాని బాధలు పడుతున్న ప్లాంటేషన్ మహిళా కార్మికులపై ఇది మరో మోయరాని భారమైంది. ట్రేడ్ యూనియన్ల పరోక్ష మద్దతుతో యాజమాన్యం చేసిన మోసానికి వ్యతిరేకంగా మహిళా కార్మికుల ఆగ్రహ ప్రదర్శనకు ఇది కారణమైంది.

ఈ పరిస్థితులు మహిళా కార్మికులను స్వతంత్రమైన, సహజమైన నిరసన చర్యలకు పురికొల్పాయి. సెప్టెంబరు 3 నుండి మున్నార్‌లోని కెడిహెచ్‌పి ముఖ్యమైన ఆఫీసుల ముందు వారు సమ్మెకు దిగారు. 6000 మంది పాక్షికంగా అక్షరాస్యులైన మహిళా కార్మికులు, ఏవిధమైన నిర్వహణా నైపుణ్యాలు లేని వాళ్ళు. తమ ప్రయోజనాలను కాపాడుకోవటానికి, అధికారంలో వున్నవారికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు. వాళ్ళు 20శాతం బోనస్‌ను డిమాండు చేయటంతోపాటు, ప్రస్తుతం రోజుకు 232 రూ॥లుగా వున్న కనీస వేతనాన్ని రోజుకు రు.500/- చేయాలని కోరారు. మోసపూరిత రాజకీయ పార్టీల నాయకులను, యజమానులతో కుమ్మక్కైన కార్మికసంఘాలను పక్కనపెట్టి ఆందోళన కొనసాగించటానికి వారు నిశ్చయించారు. కార్మిక సంఘాలపై వారు తీవ్ర అసంతృప్తితోనూ, ఆగ్రహంతోనూ వున్నారు. పురుషులను తాగుడు బారినుండి తప్పించటానికి కార్మిక సంఘాలు ఏవిధమైన చర్యలు తీసుకోకపోవటం వారి ఆగ్రహానికి కారణం. 6000 మంది మహిళలు కంపెనీ హెడ్డాఫీసు ముందున్న మెయిన్‌రోడ్డును ఆక్రమించారు. 'పెంపిలాయి ఒరుమాయి' (మహిళల ఐక్యత) బ్యానర్‌పై వారీ ఆందోళన సాగించారు.

ప్లాంటేషన్ మహిళా కార్మికులు ఆందోళన ప్రారంభించిన తర్వాత మాత్రమే సిపిఐ, సిపిఐ(ఎం), కాంగ్రెసు వంటి పార్టీలు, వారి అనుబంధ కార్మిక సంఘాలు ఈ ఆందోళన యొక్క ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను అర్థం చేసుకున్నాయి. తమ ప్రతిష్టకు కలగబోతున్న నష్టాన్ని కూడా వారు అంచనా వేసుకున్నారు. అందుకే ఈ ఆందోళనకు మద్దతిచ్చే పేరుతోను, దీనికి సంఘీభావం ప్రకటించే పేరుతోనూ ఉద్యమంలో ప్రవేశించటానికి వారు ప్రయత్నాలు ప్రారంభించారు.

కానీ మహిళా కార్మికులు ఈ కార్మికసంఘాల నాయకత్వాన్ని దృఢంగా తిరస్కరించారు. మహిళా కార్మికులు, పిల్లల తల్లులతో సహా ప్రతిరోజూ ఉదయం 10 గం॥లకు కంపెనీ ఆఫీసుకు చేరుకునేవారు. వాళ్ళు రోడ్లను దిగ్బంధం చేశారు; కానీ ఏనాడూ హింసకు పాల్పడలేదు.

కాంగ్రెసు, సిపిఐ(ఎం) పార్టీలు వారి మహిళా నాయకులను, సమ్మెచేస్తున్న మహిళా కార్మికులకు సంఘీభావం తెలియజేయటానికి, వాళ్ళలో ప్రవేశపెట్ట బోయినప్పుడు, ఆందోళన చేస్తున్న మహిళా కార్మికులు వారిని సమ్మెస్థలం నుండి తరిమికొట్టారు. స్థానిక ఎంఎల్ఏ అక్కడి నుండి పారిపోయాడు. ఎల్డిఎఫ్ నుండి, యుడిఎఫ్ నుండి వచ్చిన మహిళా నాయకులు అనేకమంది సమ్మెకారుల ఆగ్రహాన్ని చవిచూశారు. కేవలం సిపిఐ శాసనసభ్యులు ఇ.ఎస్.బీజిండ్, సమ్మె ప్రారంభంలోనే వారిని కలిసినందున, కొచ్చిలో చర్చలు జరిగి, ఒక పరిష్కారం ఏర్పడేవరకు వాళ్ళతో కలిసి కూర్చోవటానికి అంగీకరించారు.

9 రోజుల సమ్మె అనంతరం, అనేకమార్లు చర్చలు జరిగిన పిదప యాజమాన్యం మహిళాకార్మికుల న్యాయమైన డిమాండ్లకు తల ఒగ్గక తప్పలేదు. సెప్టెంబరు 13న ముఖ్యమంత్రి 8.33 శాతం బోనస్గాను, 11.67 శాతం పరిహారంగాను మొత్తానికి 20శాతం చెల్లించనున్నట్లు ప్రకటించాడు. ఇది కూడా సెప్టెంబరు 21 లోపు చెల్లించాలి. కనీస వేతనాన్ని రోజుకు రు.500/–గా చెయ్యాలన్న డిమాండును సెప్టెంబరు 26న జరిగే ప్లాంటేషన్ లేబర్ కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయిస్తారని కూడా ప్రకటించాడు.

రాజకీయ పార్టీలను, కార్మిక సంఘాలను వాటన్నింటి వాదనలతో సహా పక్కనబెట్టి, ఒక ప్రసిద్ధమైన నాయకత్వం ఎవరూ లేకుండా సాగిన ప్లాంటేషన్ మహిళా కార్మికుల సమ్మె అసమానమైనది. తమ ప్రధాన డిమాండైన 20శాతం బోనస్ను సాధించటంలో అది విజయవంతమై ప్లాంటేషన్ కార్మికుల ఉద్యమాల చరిత్రలోనే చరిత్రను సృష్టించింది. అది కార్మికుల ఉద్యమాలపై ట్రేడ్ యూనియన్ల గుత్తాధిపత్యాన్ని దెబ్బతీయటంతోపాటు, కార్మికుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రముఖ యూనియన్ల వైఫల్యాలను, దివాళాకోరుతనాన్ని ఎత్తిచూపింది. వామపక్ష పార్టీలతో సహా రాజకీయపార్టీల బుకాయింపులన్నింటినీ అది కడిగిపారేసింది. కార్మికుల పార్టీగా సిపిఐ(ఎం)కున్న పేరును అది ధ్వంసం చేసి కార్మికులలో సిపిఐ(ఎం) ప్రభావానికి గండికొట్టింది.

ఒక స్పష్టమైన నాయకత్వంలేని ఈ సమ్మెవల్ల తమకున్న పునాదులు కదిలిపోతాయోమోనన్నదే ప్రధానపార్టీల ఆందోళన అంతా. దీనివల్లే సిపిఐ(ఎం), కాంగ్రెస్పార్టీ నష్ట నివారణా చర్యలను ప్రారంభించాయి. సమ్మెచేస్తున్న కార్మికుల వద్దకు వారి మహిళా నాయకులను పంపారు. ఇంకా మాజీమంత్రి పి.కె.శ్రీమతిని, కేరళ ప్రదేశ్ కాంగ్రెసు నాయకురాలు, ఎం.పి. అయిన బిందుకృష్ణను వారితో కలిసికూర్చోవటానికి పంపారు.

చర్చల ముగింపు రోజైన సెప్టెంబరు 13న, అనుకూలమైన ఒప్పందానికి వచ్చిన రోజున ప్రతిపక్ష నాయకుడైన వి.ఎస్. అచ్యుతానందన్ స్వయంగా మున్నార్ వచ్చి, మహిళా కార్మికులు సమ్మెచేస్తున్న స్థలానికి వెళ్ళి వాళ్ళకు సంఘీభావం ప్రకటిస్తూ ఇలా అన్నాడు. "ఒకసారి అధికారంలోకి వచ్చాక ఎల్డిఎఫ్, ఒక కొత్త మున్నార్ను సృష్టించే ఎజెండాను ముందుకు తీసుకుపోతుంది." ఒక అస్పష్టమైన వాగ్దానాన్ని, కార్మికుల ఆకాంక్షలతో ఏమాత్రం సంబంధంలేని దాన్ని ప్రకటించటంలో అతని, అతని పార్టీ ఆకాంక్షలేమిటన్నది స్పష్టంగానే వుంది. విసిగి, వేసారి వున్న కార్మికుల ఓట్లను పొందటంద్వారా ప్రభుత్వాధికారంలోకి రావాలన్నదే వారి ఆసక్తి అంతా.

అక్టోబరు 4న స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్నందున, ఈ మహిళా కార్మికుల సమ్మె – అధికారం కోసం పోటీపడుతున్న ప్రధాన పార్టీలైన కాంగ్రెసు, సిపిఐ(ఎం)లను చీకాకు పరిచింది.

మున్నార్ మహిళా కార్మికుల సమ్మె విజయ వంతమైన తర్వాత, సిపిఐ(ఎం) పార్టీ కేంద్రపత్రిక 'పీపుల్స్ డెమోక్రసీ' 14.9.2015 సంచికలో ఒక చిన్న వ్యాసం ప్రచురించింది. మహిళా కార్మికుల విజయాన్ని వర్ణిస్తూ, సిపిఐ(ఎం), ప్రత్యేకించి వివిఎస్. అచ్యుతానందన్ మరియు సిఐటియులు ఇచ్చిన ప్రత్యక్ష మద్దతువల్లే ఈ విజయం సాధ్యపడిందన్నట్లు ఆ వ్యాసంలో పేర్కొన్నారు.

మొదట్లో మహిళలు సాగించిన ఈ పోరాటాన్ని సోషల్ మీడియా ఏమాత్రం పట్టించుకోలేదు. మూడు రోజులకు పైగా సమ్మె నడచిన తర్వాత మాత్రమే సోషల్ మీడియా దానిని గుర్తించింది. సమ్మె విజయాన్ని అది ప్రశంసించింది. అంతేకాక ఈ సమ్మెకు సంబంధించిన అన్ని వాస్తవాలను, సమ్మె విజయంలో ఇమిడి వున్న అన్ని చిక్కుముళ్ళను అది వెలుగులోకి తెచ్చింది.

ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెసు, సిపిఐ(ఎం) వాటి అనుబంధ కార్మికసంఘాలు తమను తాము రక్షించుకునే ప్రయత్నంలో ఒకవైపు బూటకపు అణకువ తనాన్ని ప్రదర్శిస్తూనే మరోవైపు విజయవంతమైన మున్నార్ మహిళా కార్మికుల సమ్మె ప్రాధాన్యతను, ప్రాసంగికతను తక్కువ చేసేరూపంలో ఎదురుదాడి ప్రారంభించాయి.

యుడిఎఫ్ ప్రభుత్వ విధానాలే, టీ తోట కార్మికుల దురవస్థకు ముఖ్య కారణమని చెప్పటం, తమ సంఘీభావం వల్లే ఈ సమ్మె విజయవంతమైందని ఆకట్టుకోవటానికి చూడటం అన్నది సిపిఐ(ఎం), సిఐటియులు ఎంచుకొన్న పద్ధతి.

మరోవైపు సిపిఐ(ఎం), సిఐటియులు టీ తోట కార్మికుల ప్రయోజనాల విషయంలో కెడిహెచ్‌పి కంపెనీతో రాజీపడ్డాయని కేరళ ముఖ్యమంత్రి ఆరోపించారు. వామపక్ష కార్మికసంఘాలు ప్రజాస్వామ్య పద్ధతిలో పనిచేయటంలేదని, అదే మహిళా కార్మికుల సమ్మెకు కారణమైందని కూడా వారు నిందించారు.

కార్మిక సంఘాల నేతలు, వారెంతగా బాధ్యతను క్రిందిస్థాయి నాయకత్వంపై నెట్టే ప్రయత్నం చేసినప్పటికీ, తాము చేసిన తప్పిదాలకు వారు అవమానపడక తప్పలేదు.

సిఐటియు కేరళ రాష్ట్ర అధ్యక్షుడైన అనంతలవోట్టం ఆనందన్ సెప్టెంబరు 14న హిందూ పత్రికలో ఈ విధంగా అంగీకరించాడు: 'ఇది స్పష్టమే. ఇప్పుడున్న క్లిష్ట పరిస్థితుల్లో మేం గనుక బేరమాడితే తోటలను, ఫ్యాక్టరీలను మూసేయాల్సి ఉంటుందనే యాజమాన్యపు వాదన నుండి మేము తప్పించుకోలేకపోయాం. వాటికి భయపడి మేం వెనుకడుగు వేయాల్సింది కాదు". ఆవిధంగా అతను చాలా స్పష్టంగా తమ కార్మికసంఘం యొక్క రాజకీయ దివాళాకోరుతనాన్ని అంగీకరించాడు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఏఐసిటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిన కణన్ రాజేంద్రన్ సిఐటియు అధ్యక్షుని అభిప్రాయంతో ఏకీభవిస్తూ, అతను అదనంగా అన్నదేమంటే కార్మికుల జీవన ప్రమాణాలకు, వారి ఆదాయాలకు ఏమాత్రం సంబంధంలేదని, రోజుకు రూ. 500/–గా కనీస వేతనం ఉండాలనే డిమాండును తాము పెట్టి ఉండాల్సిందని అన్నాడు. ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడైన ఆర్. చంద్రశేఖరన్ ఇదంతా స్థానిక కార్మికసంఘ నాయకత్వాల వైఫల్యమని, మొత్తం బాధ్యతనంతా వారిపైకి నెడుతూ తప్పించుకోజూశాడు.

ఈ మూడు కార్మికసంఘాలు సెప్టెంబరు 2న జరిగిన అఖిలభారత ఒకరోజు సమ్మెలో భాగంగా అప్పటికే తాము రోజుకు రూ. 500/– కనీస వేతనాన్ని డిమాండు చేశామని వాదించటంలో ఏకగ్రీవంగా ఉండి, మహిళా కార్మికుల సమ్మెలోని ఈ డిమాండుకు ఏవిధమైన ప్రత్యేక ప్రాముఖ్యతలేదని చెప్పే విఫల ప్రయత్నాలను చేశాయి.

కానీ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు సమ్మె జరుగుతున్నప్పుడు, సమ్మె విజయ వంతమైన తర్వాత వారి నిష్క్రియ, వైఫల్యాలపట్ల ప్రజల నుండి, మీడియా నుండి తీవ్ర విమర్శలనెదుర్కోవలసి వచ్చింది.

అందుకే సిపిఐ(ఎం), సిఐటియు మున్నార్ మహిళల సమ్మెను, దాని ప్రాధాన్యతను తక్కువచేసి చూపటానికి ఇంకా చెప్పాలంటే పరిహసించటానికి పూనుకున్నాయి. ఎంతో నేర్పుగా 'స్వార్ధప్రయోజనాలు', 'గుత్తాధిపత్య మీడియా' అంటూ తమను తీవ్రంగా విమర్శించినవారిని అవి ఖండించాయి. పీపుల్స్ డెమోక్రసీ సెప్టెంబరు 21–27 సంచికలో ఎళ్మారం కరీం వ్రాసిన వ్యాసం ప్రచురితమైంది. ఈ వ్యాసంలో మున్నార్ టీ తోటల సమ్మె వాస్తవాలను తెలియచేస్తున్నా మంటూ వారి అసలు స్వరూపాన్ని, అభిప్రాయాలను, రాజకీయ అవగాహనను, వారి నిరంకుశాధికార సంఘ నాయకత్వపు కార్యాచరణను బట్టబయలు చేసుకున్నారు.

తమ రాజకీయ దివాళాకోరుతనాన్ని, వైఫల్యాలను సమర్ధించుకోవటానికి ఆ వ్యాసం ఈ క్రింది వాదనలను చేసింది.

'మున్నార్ సమ్మె ట్రేడ్ యూనియన్లకు వ్యతిరేకమైందని స్వార్ధ ప్రయోజనాలతో విస్తృత ప్రచారం చేశారు. గుత్తాధిపత్య మీడియా సహజంగానే ఈ అవకాశాన్ని వామపక్ష విధానాలను, వాటి కార్మిక సంఘాలను విమర్శించటానికి వాడుకుంది. మున్నార్ సమ్మెకు కొద్దిగా ముందే భారతదేశంలోని కార్మికవర్గం సెప్టెంబరు 2న చారిత్రాత్మక సమ్మెకు దిగింది. భారత ప్రభుత్వపు నూతన సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన అతిపెద్ద సమ్మె ఇది. మున్నార్ కార్మికుల డిమాండులాగే జాతీయ సమ్మె కూడా రోజుకు రూ. 500/– కనీస వేతనాన్ని డిమాండు చేసింది. కార్పొరేట్ మీడియా కొన్ని యూనియన్లులేని యాదృచ్ఛిక సమ్మెలను ప్రోత్సహించటం, నిర్మాణయుతమైన కార్మిక ఉద్యమాలను బలహీనపరచటానికే. సిఐటియు, బోనస్‌ను కత్తిరించాలన్న కెడిహెచ్‌పి యాజమాన్యపు నిర్ణయాన్ని అంగీకరించలేదు. బోనస్ తీసుకోవద్దని నిర్ణయించుకుంది. యాజమాన్యపు నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికులు పనివేగాన్ని తగ్గించే సమ్మెకు దిగారు. కానీ యాజమాన్యం పనివేగాన్ని తగ్గించటం సమ్మె కిందకే వస్తుందని, అది ప్లాంటేషన్ల లాకౌట్‌కు దారితీస్తుందని తెలియచేసింది. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాలు పనివేగాన్ని తగ్గించే సమ్మెను ఆపేయాలని నిర్ణయించుకున్నాయి. సెప్టెంబరు 2న జరిగిన జాతీయ సమ్మెలో ప్లాంటేషన్ విభాగమంతా పాల్గొంది. బోనస్ పైనా, వేతనాలపైనా సత్వర నిర్ణయాన్ని డిమాండ్‌చేస్తూ, సెప్టెంబరు 3 నుండి మున్నార్ మహిళా కార్మికులు సమ్మెకు దిగారు. టాటా యాజమాన్యం యొక్క కార్మిక వ్యతిరేక వైఖరి, ప్రభుత్వం యొక్క యధాలాపధోరణి పరిస్థితిని తీవ్రతరం చేసింది. దీనిని కొంతమంది మీడియావారు కార్మికసంఘాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా అభివర్ణించారు. అంతకు ముందే ఒక మాజీ నక్సలైట్ నాయకుడు పెట్టిన ఒక కొత్త యూనియన్ 'GROW'ను ప్రశంసిస్తూ, మీడియా దానిని ఆకాశానికెత్తింది. GROWకు అది దేశవ్యాప్త ప్రచారం కల్పించింది.'

ఇంకా ఈ వ్యాస రచయిత ప్రస్తుతం GROW ఎక్కడ ఉందని ప్రశ్నిస్తున్నాడు. అన్ని జాతీయ కార్మిక సంఘాలను వ్యతిరేకించిన దత్తా సామంత్ ఆధ్వర్యంలోని బాంబే టెక్స్‌టైల్స్ యూనియన్ పరిస్థితి ఏమిటని కూడా ఆయన ప్రశ్నిస్తున్నాడు. క్లిష్టమైన ప్రశ్నల నుండి దృష్టి మళ్ళించటానికి మున్నార్ కార్మికవర్గపు ఉద్యమాల గత చరిత్ర తాలూకు సెంటిమెంట్లను లేవనెత్తుతున్నాడు. కార్మికోద్యమం కోసం అసువులుబాసిన అమరులు హసన్ రేల్‌థట్, పప్పా అమ్మాళ్‌ల గాథలను గుర్తు చేస్తున్నాడు. ప్రభుత్వాలన్నీ అమలుచేస్తున్న నూతన సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా కార్మికసంఘాలు పోరాటాలు సాగిస్తున్నాయని ఆయన వక్కాణిస్తున్నాడు.

ఈ కూలంకష సమగ్ర వ్యాసంలో ఈ మూడు కార్మికసంఘాలు సాధారణ టీ కార్మికుల ఆకాంక్షలకు, అంచనాలకు నిలబడటంలో ఎందుకు వైఫల్యం చెందాయన్నది ఎక్కడా కనపడదు. బోనస్‌లో కోతకు వ్యతిరేకంగా పోరాడటంలో వారెందుకు విఫలమయ్యారు? 63 సం॥కు పైగా ప్లాంటేషన్ లేబర్ కమిటీ వేతనాలను నిర్ణయిస్తోంది. ఆ కమిటీలో సిఐటియు సభ్యత్వాన్ని కలిగి ఉండి రూ. 82/–కు మించి వేతనంలో పెంపును సాధించలేకపోయింది. ఈ మొత్తం కాలంలో కొన్నిసార్లు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికి కూడా. సెప్టెంబరు 2 దేశవ్యాప్త సమ్మె ద్వారా ఇంతవరకు ఏ డిమాండునూ ఎందుకు సాధించలేకపోయారు?

ఈ వ్యాసం ద్వారా అర్థం చేసుకోవలసిందేమంటే, సెప్టెంబరు 2న జరిగిన ఒకరోజు సాధారణ సమ్మె ఈ కార్మికసంఘాల ఆధ్వర్యాన జరిగింది. ఇంకెవరికీ కనీస వేతనాన్ని పెంచమని డిమాండు చేసే హక్కులేదు. తమ డిమాండ్ల సాధన కొరకు ఈ కార్మికసంఘాలతో సంబంధంలేని స్వతంత్ర యూనియన్లు వారంతటవారు సమ్మెకు దిగకూడదు. కార్మికోద్యమమంటే ఈ కార్మికసంఘాలతో నిర్వహింపబడేది, నడపబడేది మాత్రమే. యాదృచ్ఛికమైన, యూనియన్ రహిత సమ్మెలు నిర్వహించబడకూడదు. ఇదంతా కూడా సిఐటియు యొక్క దాని రాజకీయ గురువైన సిపిఐ(ఎం) పార్టీ యొక్క రాజకీయ అవగాహనలోని దివాళాకోరు తనాన్ని సూచించటంతోపాటు, వాటి ట్రేడ్ యూనియన్ నాయకత్వం ఎంతగా నిరంకుశాధికార స్థాయికి చేరిందో బట్టబయలు చేస్తోంది. మరొకటి కూడా స్పష్టమైందేమంటే ఈ కార్మికసంఘాలు క్రిందిస్థాయి సభ్యుల నుండి పైదాకా పనిచేసే ప్రజాస్వామిక పద్ధతిని తిరస్కరిస్తూ, పైనుండి క్రిందకు పనిచేసే అప్రజాస్వామిక పద్ధతిని, ప్రభుత్వ ఆఫీసుల వ్యవస్థలాగా పనిచేసే పద్ధతిని ఎంచుకున్నాయి. కార్మికుల ప్రయోజనాలు, కార్మికవర్గ ప్రయోజనాలతో సంబంధంలేకుండా పోయిన తర్వాత, కార్మికవర్గ అగ్రగామి దళమైన కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలను వదిలేసిన తర్వాత, మిగిలేది చెత్త మాత్రమే. మున్నార్ మహిళల విజయం తర్వాతైనా, ఈ సంఘాలు గుణపాఠాలు తీసుకోవటానికి, ఆత్మవిమర్శ చేసుకోవటానికి, తమ తప్పులను సరిచేసుకోవటానికి, సరైన దారిలో నడవడానికి తిరస్కరిస్తున్నాయి. దీనికి భిన్నంగా మరింత అహంభావంతోను, నిరంకుశత్వం తోనూ ఉండటాన్నే ఎంచుకున్నాయి.

ఏదేమైనా మున్నార్ మహిళల విజయంకారణంగా తమ చొరవను వెనక్కుతెచ్చుకునే ప్రయత్నంలో ప్రముఖ యూనియన్లు టీ తోట కార్మికుల కనీస వేతనం రోజుకు రూ. 232/–గా ఉన్నదాన్ని రూ. 500/– చేయాలనే నిరవధిక ప్రచారాన్ని ప్రారంభించక తప్పలేదు. సెప్టెంబరు 28 నుండి వారు నిరవధిక సమ్మె ప్రారంభించారు. మున్నార్ మహిళలు చూపిన చొరవ ఈ రాష్ట్రవ్యాప్త సమ్మెకు అవసరమైన ప్రేరణనిచ్చిందనేది మాత్రం నిర్వివాదాంశం.

17 రోజులు జరిగిన ఈ రాష్ట్రవ్యాప్త సమ్మెలోనూ ఈ కార్మికసంఘాలు, రాజకీయపార్టీలు మున్నార్ మహిళల స్వతంత్ర సంస్థ అయిన 'పెంపిలాయి ఒరుమాయి' పై తమ గుత్తాధిపత్య హక్కును, ఆధిపత్యాన్ని రుద్దటానికి శక్తివంచనలేకుండా ప్రయత్నించాయి. తాము నిర్వహిస్తున్న సమ్మెలోకి వారిని ఆకర్షించటం ద్వారా తమ విషపు ధృతరాష్ట్ర కౌగిలిలో వారిని బంధించటానికి చూశాయి.

ఐఎన్‌టియుసికి చెందిన ఎ.కె. మణిలాంటి సీనియర్ ట్రేడ్‌యూనియన్ నాయకులు, సిపిఐ(ఎం)కు చెందిన ఎస్. రాజేంద్రన్ వంటి రాజకీయవేత్తలు వారిని కార్మికసంఘాలతో కలిసిపోవటానికి అంగీకరింపజేయ జూశారు. కానీ మున్నార్ మహిళలు ట్రేడ్ యూనియన్లు ప్రారంభించిన సమ్మెలో పాల్గొనటాన్ని తిరస్కరించారు. కానీ కనీసవేతనం రోజుకు రూ. 500/– చేయాలనే డిమాండుతో వారు విడిగా తమ స్వంత ఆందోళనను ప్రారంభించారు.

మున్నార్ మహిళల స్వతంత్ర వైఖరి ఈ కార్మిక సంఘాలవారిని తీవ్ర అసహనానికి గురిచేసింది. వారిలో కొంతమంది మున్నార్ మహిళలను సమ్మె స్థలానికి వెళ్ళకుండా అడ్డుకోజూశారు. పోలీసుల జోక్యంతో ఇది నివారింపబడింది. మహిళల ఈ స్వతంత్ర వైఖరికి ఆగ్రహించిన కొందరు పురుష కార్యకర్తలు మహిళల ప్రదర్శనపై రాళ్ళతో దాడిచేశారు. ఈ దాడిలో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈవిధమైన బెదిరింపుల ద్వారా మహిళా కార్మికులకు పగ్గం వేయాలని కార్మికసంఘాలు చూశాయి. కానీ మహిళా కార్మికులు వారి ప్రయత్నాలను తిప్పికొడుతూ దృఢంగా ప్రకటించారు. "మాకు పోయేదేమీ లేదు." "ఆకలి, బాధ మా జీవితాల్లో ఒక భాగం. పస్తులతో చనిపోవటాన్ని మేం లెక్కచేయం." "కానీ మమ్మల్ని దోపిడీ చేయటానికి ఎవ్వరినీ మేం అనుమతించం. ఇక్కడితో ఇది సరి".

వారి నిర్ణయం మెచ్చుకోదగింది. ఈ కార్మిక సంఘాల ఆధిపత్యం కింద, పెత్తనం కింద తగ్గి ఉండాల్సిన అవసరం వారికేమీ లేదు. ఎందుకంటే కార్మికుల చిన్న చిన్న ప్రయోజనాలను పరిరక్షించటంలో కూడా గుర్తింపు కార్మికసంఘాలు ఎంతో నిరాశాజనకంగా ఉన్నాయి, విఫలమయ్యాయి. ఈ నిరంకుశాధికార కార్మికసంఘాలకు దూరంగా వారు స్వతంత్రంగా తమను తాము నిర్మాణయుతం గావించుకోగలరు.

'పెంపిలాయి ఒరుమాయి'ని కేరళలో ఒక అసాధారణ సామాజిక ఉద్యమంగా గుర్తిస్తూ ప్రసిద్ధ రచయితలు, కార్యకర్తలు 60 మంది వారి ఉద్యమాన్ని గౌరవిస్తూ, ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయే నిమిత్తం లక్ష రూపాయల నగదు మొత్తాన్ని మహిళా కార్మికులకు మూలనిధిగా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.

ఒక నిజమైన, నిజాయితీతో కూడిన శ్రామికోద్యమం ఏవిధంగా ప్రజల మద్దతును, సంఘీభావాన్ని పొందుతుందో ఇది తెలియజేస్తోంది. ఈ కార్మికసంఘాల పరిధిలోలేని, అనేక కార్మిక సంఘాలు, ఇతర సంస్థలు ఈ దేశంలో పనిచేస్తున్నాయి. కార్మికుల

ప్రయోజనాలను కాపాడటంలో విజయవంతమైనవిగా అవి నిరూపించుకున్నాయి. ఉదాహరణకు అలాంటి ఒక కార్మికసంఘం అమరుడు కా॥శంకరగుహనియోగి నిర్వహించిన కార్మికసంఘం, ఆయన క్రూరమైన హత్య తర్వాత కూడా విజయవంతంగా నిలదొక్కుకుని, కార్మికుల సమస్యలపై పనిచేస్తున్నది.

బాంబేలోని దత్తాసామంత్ యూనియన్ దుస్థితి గానీ, GROW దుస్థితిగానీ ఈ కార్మికసంఘాలతో సంబంధాలలో లేకపోవటం వలన ఏర్పడిందికాదు. వివిధ ఇతర ప్రతికూల పరిస్థితులు ఆ యూనియన్ల పతనానికి కారణం. ప్రతి సంఘటనను నిర్దిష్టంగా అధ్యయనం చేసి, దాని నుండి తగిన గుణపాఠాలను తీయాలి.

అధికారంలో వున్న పాలకుల ప్రోత్సాహంతో, పరిమితమైన పని విధానంతోకూడిన పోరాటాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తుండటం వల్లే గుర్తింపు కార్మికసంఘాలు ఇంకా మనగలుగుతున్నాయన్నది నిర్వివాదాంశం. ఆందోళనలు, పోరాటాలు నిర్వహించ టంలో వారి పద్ధతి, విధానాలు చట్టబద్ధమైనంతవరకే పరిమితమౌతున్నాయి. ముందే చెప్పినట్లుగా "పనిని మందగింపచేయటం" అనే పద్ధతి ద్వారా టీ ప్లాంటేషన్ కార్మికులు జరుపుతున్న నిరసననుసైతం ఆపుచేయటం – ఇదంతా కూడా కార్మికులు నడవాల్సిన దారికాదు.

దోపిడీదారులకు వ్యతిరేకంగా నిశ్చయమైన పోరాటపంథా మాత్రమే, కార్మికుల ప్రయోజనాలను కాపడగలుగుతుందని మున్నార్ టీ తోటల మహిళా కార్మికుల సమ్మె మరోసారి గట్టిగా రుజువుచేస్తోంది.

ఈ విజయంతో మున్నార్ మహిళా కార్మికుల సంస్థ దృఢంగా నిర్మాణయుతం కావాలి. ఇది కార్మికుల ఐక్యత పునాదిగా, కార్మికవర్గ రాజకీయాల మార్గదర్శకత్వంలో జరగాలి. టీ తోటల కార్మికులకు ప్రస్తుతమున్న సహజవర్గ చైతన్యస్థాయి, తమ సంస్థను కాపాడుకోవటానికి ఏమాత్రం సరిపోదు. రాష్ట్రంలోను, దేశంలోనూ ఉన్న ఇతర తోటల కార్మికులతో ఐక్యత సాధించటానికి వారెంతో ప్రయత్నం చేయాలి. కార్మికవర్గ సమస్యలపై పనిచేసే, కార్మికోద్యమ అభివృద్ధిని ఆకాంక్షించే ప్రగతిశీల శక్తులన్నింటి సంఘీభావాన్ని వారు సాధించాలి. రాజకీయపార్టీల కుతంత్రాలకు వారు బలి కారాదు. వారి ఐక్యతను, భగ్నంచేసి సంస్థను విచ్ఛిన్నం చేయటానికి అవి ప్రయత్నిస్తాయి. స్వార్ధ ప్రయోజనాల దాడులపట్ల వారు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, తమను తాము రక్షించుకోవటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి. కార్మికవర్గానికి అననుకూలంగా ఉన్న ప్రస్తుత పరిస్థితిలో, కొన్ని వైఫల్యాలను ఎదుర్కోవ టానికి కూడా వారు సిద్ధంగా ఉండాలి. తమ ఆచరణ నుండి, ఇతర కార్మికోద్యమాల ఆచరణ నుండి తగిన పాఠాలను తీసుకొంటూ, ఒక సరైన పంథాలో వారు ముందుకు నడవాలి. కార్మికసంఘ ప్రజాస్వామ్య పద్ధతిని వారు అనుసరించాలి.

మద్యానికి వ్యతిరేకంగా పోరాడటాన్ని తక్షణమైన, ముఖ్యమైన అవసరంగా ట్రేడ్ యూనియన్లు గుర్తించా లనేది మున్నార్ టీతోట మహిళల పోరాటం ముందుకు తెస్తున్న మరొక ముఖ్యమైన విషయం. చాలామంది పురుష కార్మికులు తాగుడికి బానిసలై ఉన్నారు. ఇది ఒక పాఠంగా తీసుకుని కార్మికసంఘాలు మద్యానికి వ్యతిరేకంగా పోరాడాలి.

'పెంపిలాయి ఒరుమాయి'కి **'జనశక్తి'** తన హృదయపూర్వక మద్దతును తెలియచేస్తోంది. తన ప్రప్రథమ సమ్మెలోనే అది విజయవంతమైంది. రాజకీయ పార్టీలను, ప్రధాన సంఘాలను దూరంగాపెట్టి, స్వతంత్రంగా నడిపిన సమ్మె ద్వారా అది కేరళలోని వ్యవస్థీకృత రాజకీయపార్టీల, గుర్తింపు పొందిన కార్మిక సంఘాల వైఫల్యాలను, దివాళాకోరుతనాన్ని ప్రపంచానికి వెల్లడిచేసింది.

**కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి!**

ooooo